శ్రీ వేదవ్యాస కృత మహో భారతం

# ఆది పర్వం

సహేంద్ర తక్షకాయ అనుబ్రహి



# 1. ప్రారంభం

నారాయణ నమస్కృత్యం నరంచైవనరోత్తమం
దేవీం సరస్వతీం చైవ తతో జయ ముదీరయేత్

నైమిశారణ్యంలో కులపతి అయిన శౌనకమహర్షి సత్రయాగం ప్రారంభించాడు. పన్నెండేళ్ళు పడుతుందా యాగం పూర్తికావడానికి. ఆ సందర్భంలో, ఒక నాడు, ఉగ్రశ్రవసుడు వచ్చాడక్కడికి. లోమహర్షణ మహర్షి కొడుకతను. పురాణాలు చెప్పడమే అతని పని. సూతుడంటా రందరూ అతణ్ణి.

బ్రహ్మర్షులెందరో వున్నారప్పుడక్కడ. వినయవిధేయతలు కనబరచుకుంటూ అందరికీ నమస్కారాలు చెప్పుకున్నాడు, ముందతను. మీ తపస్సు నిర్విఘ్నంగా సాగుతోందా? అని కుశలప్రశ్న కూడా చేశాడు. అతనంటే వారి కెంతో యిష్టం. అందరూ ఆశీర్వదించారతణ్ణి. ఎంతో ఆదరంగా మాట్లాడుతూ చాలా గౌరవించారు. కూచో మన్నా రొక ఆసనం నిర్దేశించి. చిత్రవిచిత్రాలైన కథలు వినడంకోసం అతని చుట్టూ మూగారు, చివరికి వారు.

ఆ బ్రహ్మర్షుల్లో ఒక డు ముందుకి వచ్చాడు వెంటనే, ఎక్కణ్ణుంచి వచ్చావు నాయనా? ఇంతవరకూ యెక్కడ వున్నావూ? అనడిగాడతను. పరీక్షిత్తు కొడుకు జనమేజయుడు సర్పయాగం చేస్తున్నాడు. ఆ రాజుకి వైశంపాయనమహర్షి మహాభారతం వినిపిస్తున్నాడు. కృష్ణద్వైపాయనమహర్షి రచించిన గొప్ప గ్రంథం అది. ఎన్నో కథలున్నా యందులో. ఎంతో గొప్ప కథ లవి. చాలా చిత్రమైనవిన్ని. నేనవన్నీ విన్నాను. అక్కణ్ణుంచి బయలుదేరివెళ్ళి ఎన్నో తీర్థాలూ, యెన్నో క్షేత్రాలూ చూసి సేవించుకుని వచ్చాను. శమంత పంచకం అనేచోట కౌరవులకూ పాండవులకూ ఎందరో మహారాజులకూ దారుణమైన యుద్ధం జరిగింది. ఆ స్థలమున్నూ చూసి వచ్చాన్నేను. ఆ చూడ్డం చూడ్డం మళ్ళీ మిమ్మల్ని చూస్తున్నా నిక్కడ. మీరందరూ బ్రహ్మభూతులు. మీ తేజస్సు, సూర్యుని తేజస్సుకంటేనూ, అగ్ని తేజస్సు కంటేనూ చాలా గొప్పది. అగ్నిహోత్రాలు చేసుకుని, జపతపాలున్నూ పూర్తి చేసుకునివున్నారు

## 3. పౌష్యపర్వం

**ప**రీక్షితుని కొడుకు జనమేజయుడు కురుక్షేత్రంలో సత్రయాగం ప్రారంభించాడు. చాలాకాలానికిగాని పూర్తికాదది. శ్రుతసేనుడు,ఉగ్రసేనుడు, భీమసేనుడు - అని ముగ్గురు తమ్ములతనికి, వారున్నూ యజ్ఞశాలలోనే ఉన్నారన్న ఆజ్ఞలుచెల్లిస్తూ, అక్కడికొక కుక్కపిల్ల వచ్చింది. చూడ్డం తడవుగా దాన్ని కొట్టి తరిమివేసారు వారు. బాధ సహించలేక మొర్రోకుయ్యో మంటూ గోలపెడుతూ వెళ్ళి అది జరిగిందంతా తల్లికి చెప్పింది. దాని తల్లి పేరు సరమ.

అక్కడికి వెళ్ళి నువ్వేమి చేశావూ? వారు నిన్నెందుక్కొట్టారూ? అనడిగింది తల్లి. నేనేమీ యెరగను. అక్కడ నేనటూఇటూతిరిగానే గాని, హవిస్సు లేమీ నాకలేదు. వాటికేసి చూడనైనా చూడలేదు అని బదులుచెప్పింది పిల్ల.

ఇది విని, సరమ పిల్లను వెంటబెట్టుకుని వెంటనే జనమేజయునీ దగ్గిరికివెళ్ళి నీ తమ్ములు నా కొడుకుని కొట్టారు. వాడు హవిస్సులు నాకలేదు. అటయినా చూడలేదు. అయినా వారు చాలా దారుణంగా కొట్టారు. నీకిది ధర్మమా? అనడిగింది.

రాజూ, అతని తమ్ములూ కూడా దానికి బదులుచెప్పలేదు. దాని మీద, ఆ సరమ నా కొడుకు అనపరాధి. వాణ్ని కొట్టడమే కాక, ఇదేమి టనడిగితే బదులయినా చెప్పడంలేదు నువ్వు. ఇందుకు నువ్వు అనుకోని భయంతో బాధపడతావు అంది. ఇది విని జనమేజయుడు చాలా కంగారుపడ్డాడు. దుఃఖితుడున్నూ అయినాడు.

కొన్నాళ్ళ కాయాగం ముగిసింది. జనమేజయుడు హస్తినాపురం చేరుకున్నాడు. కానీ ఈపాపం నాకెలా పోతుందీ? ఈసరమ దేవశునకం, దాని శాపం ఎలాపోతుందీ? దీనికి తగ్గ శాంతిచేసుకోవాలి. అది నడిపించగల పురోహితుడెక్కడ దొరకుతాడో నాకు? అంటూ ఆలోచన ప్రారంభించాడు.

## 4. ఉదంకుని కథ

ఇక మూడో శిష్యుడు వేదుడు మిగిలాడు. అతణ్ణి పిలిచాడొకనాడు ధౌమ్యుడు. నాయనా, కొన్నాళ్ళు మాయింట్లో వుండాలి నువ్వు ఆపనిలోనూ యీపనిలోనూ కూడా కాస్త సాయంచెయ్యాలి అని చెప్పాడు. వేదు డందుకు పూనుకున్నాడు భక్తిశ్రద్ధలతో. చాలా కాలం సేవించా డతను. ఆవులను మేపాడు. ఎడ్లచేత బరువులు మోయించాడు. ఇంట్లో చిల్లరపనులన్నీ చేశాడు. చలికి జడియలేదు. వేడికి భయపడలేదు. ఆకలికి లొంగలేదు. తృష్ణకు భీతిల్లలేదు. దుఃఖాలకు వెరవలేదు. దేనికీ వోళ్లు దాచుకోలేదు. ఎందుకూ యెదురాడలేదు.

ఇదంతా గుర్తించాడు ధౌమ్యుడు. చాలాకాలం పరిశీలించాడు. చాలా సంతోషించాడు. దానివల్ల వేదున కెంతో శ్రేయస్సు కలిగింది. విద్యలన్నీ నేర్చి- సర్వజ్ఞుడున్నూ అయినాడు. చివరికి గురువు చెప్పగా పెళ్ళిచేసుకున్నాడు. గురువు యిల్లు విడిచి సొంతయిల్లు సంపాదించుకున్నాడు.

కాలక్రమాన అతనికీ ముగ్గురు శిష్యులేర్పడ్డారు. కాని వేదుడు వారి చేత తనకేమి శుశ్రూష చేయించుకోలేదు. వారి కేపనీ చెప్పలేదు. గురుకుల వాసం చేసినప్పుడు తాను పడ్డ కష్టాలన్నీ గుర్తించుకుని ఉన్నాడతను. అంచేత, వారికేవిధంగానూ క్లేశం కలిగించలేకపోయాడు.

ఇలా వుండగా, కొన్నాళ్ళకి, పౌష్యుడూ జనమేజయుడూ వచ్చి వేదుణ్ణి తమకు పురోహితుడుగా వుండమని కోరారు. ముఖ్యంగా ఒక యజ్ఞం చెయ్యదలుచుకుని అది నిర్వహించవలసిందని వారతణ్ణి కోరారు. అందుకిష్టపడ్డాడతను. ప్రయాణమున్నూ అయినాడు. వేడుతూ వెడుతూ అతను ఉదంకు డనే తన శిష్యుణ్ణి పిలిచి నేను వచ్చేదాకా నాయింట్లో యేమీ లోటురాకుండా చూస్తూవుండు. అవసరమయితే యేదయినా పనిన్నీ చేసి పెడుతూ వుండు అని చెప్పి వెళ్ళిపోయాడు.

## 7. బ్రహ్మ కిటుకు చెప్పాడు

**అ**గ్ని చేసినదానిమీద భృగుమహర్షికెంత కోపంవచ్చిందో, భృగుమహర్షి చేసిన దానిమీద అగ్నికీ అంత కోపంవచ్చింది. ఏమిటీ నీ సాహసమూ? అంటూ భృగుమహర్షిని నిలవదీసి అందుకున్నాడతను.

బ్రాహ్మణోత్తమా, ధర్మం విడిచిపెట్టకుండా నడుచుకుంటున్నాన్నేను. అలాగే సత్యమే చెబుతున్నా నెప్పుడూ. ఎదటి వారు నన్నడిగినప్పుడు నేను సత్యమే చెబితే అందులో నా దోషం యేమి ఉందీ? సాక్షి అయినవాడు,సర్వమూ తా నెరిగివుండిన్నీ, ఎదటివా రడిగినప్పు డబద్ధం చెబితే, వాడు, తన వంశీయుల్లో వెనకటి యేడుతరాల వారినీ, ముందటి యేడు తరాలవారినీ హత్యచేసిన వాడవుతాడు. కార్య కారణాలు తెలిసి వుండినవాడు, యెరిగి వుండిన్నీ సత్యం చెప్పకపోతే తానుకూడా పాపభాజను డయిపోతాడు. నేను కూడా నిన్నింతకంటే దారుణంగా శపించగలను. గాని, బ్రాహ్మణులు నాకు పరమ పూజ్యులు. కనక, చెబుతా విను. నాయోగబలం వల్ల నేను సర్వమూర్తుల్లోనూ ప్రవర్తిల్లుతూ ఉంటాను. అగ్నికార్యాల్లోనూ, సత్రయాగాల్లోనూ, సకల కార్యాల్లోనూ, యజ్ఞాల్లోనూ వేదోక్త విధాన నాలో హుతం చెయ్యబడ్డ హవ్యం స్వీకరించి దేవతలూ, పితృదేవతలూ తృప్తిపడతారు. అమావాస్యనాడు పితృదేవతల నుద్దేశించీ, పౌర్ణమినాడు దేవతల నుద్దేశించీ లోకులు హోమాలు చేస్తారు. ఆ హోమాల్లో హుతం అయినది దేవతలూ పితృదేవతలూ నాపరంగానే స్వీకరిస్తారు. భుజిస్తారు కూడా. మరి, అలాంటి నేను సర్వభక్ష కుళ్లయితే, దేవతలకు నేను ముఖం యెలా అవుతానయ్యా? అనిన్నీ అడిగా డతను.

అగ్ని మళ్ళీ ఆలోచించాడు బాగా. ఇదికాదనుకున్నాడు మార్గం. వెంటనే తన రూపం ఉపసంహరించుకున్నాడు. దాంతో, అగ్ని కార్యాల్లో నూ, యజ్ఞాల్లోనూ, పితృకార్యాల్లోనూ కూడా ఓం కారవషట్కారాలూ, స్వధాస్వాహాకారాలూ కూడా ఆగిపోయాయి. అగ్ని లేకపోడంవల్ల జనులు కూడా నానాదుఃఖాలూ అనుభవించసాగారు.

## 12. జరత్కారు చరిత్ర

**మ**హాత్మా జనమేజయమహారాజు సర్పసత్రం చేసి సర్పాల నెందుకు నాశనం చెయ్యబూనుకున్నాడూ? అగ్నిలోపడి బుగ్గయిపోతున్న ఆసర్పాలను ఆస్తీకు డెందుకు రక్షించాడూ? సర్పసత్రం చేసిన ఆ జనమేజయుడెవరి కొడుకు? ఆస్తీకుడున్నూ యెవరికొడుకు? ఇదంతా ఉన్న దున్నట్టు మాకు వివరించి చెప్పవయ్యా అనడిగాడు శౌనకుడు. ఆస్తీకుని కథ చాలా గొప్పది, వినండి బాగా అంటూ ప్రారంభించాడు సూతుడు.

ఈ యితిహాసం బ్రాహ్మణులు పురాణం అంటారు. నైమిశారణ్యవాసులకోసం కృష్ణద్వైపాయన మహర్షి రచించాడిది. నాతండ్రి అయిన లోమహర్షణుడు వ్యాసమహర్షి శిష్యుడు. తన గురువు ఆజ్ఞాపించగా నాతండ్రి బ్రాహ్మణులకు చెప్పాడిది. మానాయనవల్ల నేను విన్నాను. కనక, నేనిపు డిది మీకు వివరంగా చెబుతాను. పాపా లన్నీ పోగొడుతుం దీకథ.

ఆ ఆస్తీకుని తండ్రి పేరు జరత్కారుడు. బ్రహ్మతో సమాను డతను. బ్రహ్మచారి. ఆహారం విషయమై యెన్నో నియమాలు పెట్టుకున్న వాడతను. ఉగ్రమైన తపస్సు చెయ్యడం అతని వ్రతం. ఊర్ధ్వరేతస్కుడతను. ఒక్కొక్క గ్రామాన వొక్కొక్క రాత్రే వుంటూ యెప్పుడూ సంచారంచేసే యాయావరుల్లో చాలా గొప్పవాడతను. సకలధర్మాలూ తెలిసినవాడు. అతనే వ్రతం పట్టినా చాలా తీవ్రంగా వుంటుంది.

ఒకప్పుడతను సాయంగృహంగా - అంటే ఎక్కడ సాయంకాలం అయితే అక్కడే నివసించే వ్రతంతో భూసంచారం ప్రారంభించాడు. ప్రారంభించడమే కాదు, భూమండలం అంతా తిరిగాడు. కనపడ్డ తీర్థాలన్నిటా స్నానంచేశాడు. వాయువే భక్షించేవాడు. నిద్రవిడిచి పెట్టేశాడు.

ఇలాగా అలాగా ఇలా తిరుగుతూ ఒక నా డతను తన పితృపితామహులను చూశాడు. ఒక పెద్దగోతిలో తలకిందుగా వేలాడుతున్నారు వారు. ఒక వెదురుదుబ్బు ఆ గోతివొడ్డున అంటి పెట్టుకుని వుంది. దాని వేళ్ళు కాళ్ళతో పట్టుకుని అధోముఖంగా ఉన్నారు వారు. మీరెవరండీ? అనడిగా డతను, చూసీచూడంతోనే వారిని. ఈగోతిలో తలకిందుగా

## 15. దేవాసుర యుద్ధం

**క**వచాలు ధరించీ, ఆయుధాలు చేతపుచ్చుకునీ దేవతలమీద విరుచుకు పడ్డారు, దైత్యులూ దానవులూ కలిసి. అది చూసి, శ్రీహరి నరసహితుడై దానవుల చేతిలో ఉన్న అమృతభాండం వొడిసి పుచ్చుకున్నాడు, ముందు. అవతల పరిస్థితులన్నీ చాలా అల్లకల్లోలంగా వుండినా శ్రీహరి, వెంటనే దేవతల కిచ్చాడది తృప్తిగా పానం చెయ్యమని, ఆ దేవతల్లో మారువేషంతో ఉన్నాడు రాహువు. అచ్చంగా దేవతా కుమారుడులాగే ఉన్నాడు. అంచేత, అతనిచేతికిన్నీ అందింది. అమృతం. అది పుచ్చుకోనూ పుచ్చుకున్నా డతను. అది కంఠం మాత్రం దిగలేదింకా. అది గుర్తించి దేవతలకు హితం చెయ్యదలిచి సూర్యచంద్రు లీసంగతి శ్రీహరికి చెప్పారు. చక్రాయుధం పుచ్చుకున్నాడు శ్రీహరి వెంటనే. రాహువు తల పైకెగిరి కిందపడింది మహాభయంకరంగా అరుస్తూ మరీ కింద పడిందది. ఆపాటుతో గజగజ లాడిపోయింది భూమి.

అది మొదలు, రాహువు సూర్యచంద్రులమీద శాశ్వతంగా పగపెట్టుకున్నాడు. అప్పణుంచీ ఆకోపంతోనే వారిని మింగుతూనూ ఉన్నాడు వాడప్పుడప్పుడు. ఇంతలో స్త్రీరూపం విడిచి, రకరకాల ఆయుధాలు చేతబుచ్చుకుని దానవులనుకలిచెయ్యసాగాడు శ్రీహరి. దాంతో, ఆ లవణసముద్రతీరాన, దేవతలకూ దానవులకూ అతిఘోరంగా దొమ్మి ప్రారంభం అయింది. పదునైన ప్రాసా లెగిరాయి. సూది అయిన తోమరాలు దూసుకుపోయాయి. అన్నిటినీ మించి సుదర్శనచక్రం గిరగిరా తిరిగిపోయింది. దానవులు కుప్పగా కూలిపోసాగారు, రక్తాలోడుకుంటూ. శిరస్సులకు, రకరకాలుగా బంగారపు దండలు చుట్టుకువచ్చా రసురులు. పట్టిసాల దెబ్బలకు వారి తలలు ఎగిరి కిందపడసాగాయి.

రక్తాలోడుకుంటూ దైత్యులూ దానవులూ ఇలా తూలుతూ వుంటే, గైరికాది ధాతువులతో నిండిఉన్న గిరికూటాలు కూలిపోతున్నట్టుంది. ఈఘోరయుద్ధం ఇలా జరుగుతూవుంటే అక్కడక్కడ హాహాకారాలు మిన్ను ముట్టాయి. సూర్యుడస్తమించే సమయం అయింది. వారూ వీరూ పరిమలతోనూ, మరీ దగ్గిర అయినప్పుడు పిడిగుద్దుల తోనూ

## 18. అనూరు సారథ్యం

**నా** శరీరం చూసి భూతప్రపంచం భయపడనక్కరలేదు. నా తేజస్సు నే నుపసంహరించుకుంటున్నా నన్నాడు గరుత్మంతుడు.

అని, వెంటనే తండ్రి దగ్గరికి వెళ్ళి, తన అన్న అయిన అనూరుణ్ణి తన మూపుమీద ఎక్కించుకుని సముద్రతీరాన ఉన్న తల్లి దగ్గరికివేళ్ళాడు. అప్పటికి, సూర్యభగవానుడు, అత్యుగ్రుడై లోకాలన్నీ దహించేస్తా నంటూ తూర్పుదిక్కున ఉదయించాడు.

అదేం? అనడిగాడు రురుడు. సూర్యభగవానుడు లోకాల నేందుకు దహించెయ్యా లనుకున్నాడూ? దేవత లతని దేమి హరించారూ? అతనికంత కోపమున్నూ యెందుకు వచ్చిందీ? అని కూడా అడిగాడతను. అందు కతని తండ్రి ప్రమతి ఇలా చెప్పాడు.

రాహువు మారువేషంతో అమృతం తాగేటప్పుడు సూర్యచంద్రులు చూసి శ్రీహరికి చెప్పారు జ్ఞాపకం వుందా? అది మొదలు సూర్యచంద్రులమీద పగపట్టాడు వాడు. సూర్యుణ్ణి ఎక్కువగా బాధించసాగాడు కూడా. సూర్యున కందుకు వచ్చింది కోపం. నేను దేవతల క్షేమం కోరి వాడి సంగతి చెప్పాను. అంచేత నామీద కోపం వచ్చింది వాడికి. చాలా అనర్థకమైన యీ పాపం నన్నుచుట్టుకుందిలాగ. నేనిలా అవస్థపడేటప్పుడు దేవతలు నాకేమీ సాయంచెయ్యనక్కరలేదూ? రాహువు నన్ను మింగుతూ వుంటే వారు చూస్తూ, వూరుకోవలసిందేనా? కనక నేను లోకం అంతా దహించేస్తాను, సందేహంలేదు అంటూ వెంటనే అస్తాద్రికి వెళ్ళిపోయాడతను.

దానిమీద మహర్షులు దేవతలదగ్గరికి వెళ్ళి ఇదిగో అర్థరాత్రి అవుతోంది. చాలా భయంకరమైన మంటలు పుట్టుకువస్తున్నాయి. దీంతో, లోకం బుగ్గి అయిపోయేటట్టుంది అని చెప్పారు. వెంటనే దేవత లామహర్షులను తమ వెంటబెట్టుకుని వెళ్ళి మహాత్మా, యీ ఉపద్రవం ఏమిటీ? అనడిగారు బ్రహ్మను. సూర్యుడు కనపడ్డం లేదు. ఇప్పుడే ప్రళయం వచ్చినట్టుంది. అత నుదయిస్తే మరేమయిపోతా? అంటూ గోలపెట్టారు కూడా.

## 21. గజకచ్ఛపాలు

గరుత్మంతుడు, కనపడ్డ ప్రాణినల్లా మింగడంలో, ఒక బ్రాహ్మణుడున్నూ పడ్డాడతనినోట. నిప్పుబోగ్గు అతని కంఠాన పడ్డట్టు అతని కంఠం కాలసాగింది, దాంతో. బ్రాహ్మణోత్తమా, ఇదే నానోరు తెరిచాను బయటికి రా. బ్రాహ్మణుడెంత పాపాత్ముడైనా నేనతణ్ణి చంపను, మరి అన్నాడతను, ఆకాశాన నిలిచీ, నోరు తెరిచీని.

సంతోషమే; నా వెంట నాభార్య కూడా ఉంది. ఆమె నిషాద స్త్రీ మరి. ఆమె కూడా నా వెంట రావలసిందే అన్నాడు బ్రాహ్మణుడు. అయితే, నీపుణ్యమాయె, నాకజీర్ణబాధ కలగనివ్వకు. ఆమెను వెంటబెట్టుకునే బయటికి వచెయ్యి అన్నాడు గరుత్మంతుడు. నాయనా, వర్ధిల్లు అంటూ గరుత్మంతు ఆశీర్వదించి, ఆ బ్రాహ్మణుడు తన భార్యతో గూడా యథేచ్ఛగా వెళ్ళిపోయాడు.

తరవాత, తన రెక్కలు విప్పి, ఆకాశాని కెగిరి, తన తండ్రి దగ్గరకు చేరుకున్నాడు గరుత్మంతుడు. నాయనా, మనుష్యలోకంలో మీరందరూ కుశలంగా వున్నారా? నీకు సమృద్ధిగా భోజనందొరుకుతోందా? అనడిగాడు తండ్రి కశ్యపుడతణ్ణి ముందాశీర్వదించి. అమ్మా, అన్నయ్యా, నేనూ కుశలంగానే ఉన్నా మన్నాడు గరుత్మంతుడు అందుకు. కాని నాకు భోజనం చాలడంలేదు ప్రభూ, నేనిప్పుడు మా అమ్మ దాస్యం పోగొట్టడానికి, నాగుల కోరికమీద అమృతం తేవడానికి వెడుతున్నాను. ఇప్పుడే తెచ్చేస్తాను, సందేహం లేదు. నిషాదులను భక్షించి నాఆకలి తీర్చుకోమంది అమ్మ. భక్షించాను; కాని నాకడుపు నిండలేదు. కనక, నువ్వుకూడా తినడానీ కేమయినా చూపించు నాకు. తరవాతి సంగతి యేమయినా, అమృతం తీసుకురావాలంటే తగినంత శక్తి వుండాలి నాకు. ముందు నాఆకలి పోగొట్టు నాయనా అని ప్రార్థించాడు గరుత్మంతుడు వివరాలు చెప్పి.

దానిమీద కశ్యపుడిలా అన్నాడు. నాయనా, ఈ సరస్సు చూశావా? చాలా పుణ్యప్రదమైనదిది. దేవలోకంలో కూడా చాలా ప్రతిష్ట వుంది దీనికి. ఇందులో ఏనుగొకటి తాబేటిరూపంతో ఉన్న తన అన్నని పడలాగుతూ వుంటుంది, తరచు, బుర్రవంచుకుని ఆ

## 23. అమృత రక్షణం

**దే**వతలందరూ సమస్తాయుధాలు చేతబట్టి ఇలా యుద్ధానికి సిద్ధపడే టప్పటికి గరుడు అక్కడికి చేరుకున్నాడు. మహాబలశాలి అయిన ఆ గరుడుడ్ని చూసి దేవతలు వొణికిపోయారు. ఒకరితో ఒక రు కూడబలుక్కున్నారు. చివరికి యుద్ధానికి సిద్ధపడ్డారు.

ఈలోపున విశ్వకర్మ గరుడు ణెదిరించాడు. చంద్రుడికి రక్షకుడతను. అతనుకూడా మహావీరుడు. విద్యుత్తుతోను అగ్నితోనూ సమానుడు. అతని సంగతి వూహల కందేదికాదు.

అత నెదిరించాడు గరుడుట్లే. కొంతసేపు బాగానే చేశాడు యుద్ధం. కానీ, కొద్దిసేపటికే మొగం వేలవేశాడు. గరుడు డతణ్ణి రెక్కలతో కొట్టాడు. గోళ్ళతో గీరాడు. ముక్కుతో పొడిచాడు. కీచు మనిపోయాడు విశ్వకర్మ చాపచుట్టగా పడిపోయాడు చివరికి.

తక్కినవారితో కలియబడ్డాడు గరుడుడు. రెక్కలాడించి దుమ్మూ ధూళీ యెగరగొట్టా డతను ముందు. సూర్యు డస్తమించిన ట్టయిపోయింది దాంతో. ఎంతెంతవారికీ గూడా కళ్ళు కనపడలేదు. ఆ దుమ్ములో కప్పడిపోయారు దేవతలు. దాంతో, మంత్రముగ్ధులయినట్టు దారీతెన్నూ తెలియక స్తంభించిపోయారు. అమృతరక్షకుల క్కూడా యేమీ కనపడలేదు, ముందువెనకలు.

ఇలాగ దేవతల నందరినీ కలిచిపారేశాడు గరుత్మంతుడు. స్వర్గం అంతా చికాకు పడిపోయింది, క్షణంలో. రెక్కలతోనూ, గోళ్ళతోనూ, ముక్కుతోనూ కొట్టి కొట్టి గీరిగీరి, పొడిచిపొడిచి చీకాకు పరిచేశాడు. అది చూశా డింద్రుడు. వాయుదేవుణ్ణి పిలిచా డతను వెంటనే. ఈ దుమ్మంతా చెదరగొట్టు. ఇది నీపని అని ఆజ్ఞాపించాడు.

వెంటనే ఆపనిచేశాడు వాయువు. దుమ్మణగిపోయింది. దిక్కులు తెల్లవారాయి. అందరికీ చూపానింది. ఈ సందుబాటు చూసుకుని దేవతలు గరుడునిమీద విరుచుకుపడ్డారు. అన్ని రకాల ఆయుధాలూ వాడి చీకాకుపరిచా రతణ్ణి. ఆకాశం బద్ద లయిపోయేటట్టు సింహనాదాలున్నూ చేశారు, పరవళ్ళు తొక్కుతూ.

## 26. నాగుల పేళ్ళు

**ఇ**దంతా విన్నాడు; కాని వొక్క లోపం వుండిపోయినట్టు చూస్తూ సూతనందనా, కద్రువు నాగులను శపించడమూ, అరుణుడు వినతను శపించడమూ, వాటి కారణాలూ వివరంగా చెప్పావు నువ్వు. కద్రూవినతలకు కశ్యపుడు వరాలివ్వడమున్నూ బాగా చెప్పావు. విశేషించి వైనతేయుల పేళ్ళున్నూ చెప్పావు. కాని కద్రువు కొడుకుల పేళ్లు చెప్పావుకావు. నాకదొక లోపంగా కనపడుతోంది, కనక, వారిలో ముఖ్యుల పేళ్ళయినా చెప్పవయ్యా అని కోరాడు.

సూతు డందుకున్నాడు వెంటనే. తపోధనా, కాద్రవేయులు చాలామంది. నువ్వు భావించినట్టు వారందరిపేళ్లూ చెప్పడం అసాధ్యమూ, అనవసరమున్ను, ప్రధానుల పేళ్లు మాత్రం చెబుతాను విను. వారిలో శేషుడు ముందు పుట్టాడు. తరవాత వాసుకి పుట్టాడు.

ఐరావతుడు, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు, కాళీయుడు, మణినాగుడు, ఆపూరణుడు, పింజరకుడు, ఏలాపత్రుడు, వామనుడు, నీలుడు, అనీలుడు, కల్మాషుడు, శబలుడు, ఆర్యకుడు, ఉగ్రకుడు, కలశపోతకుడు, సుమనుడు, దధిముఖుడు, విమలపిండకుడు, ఆప్తుడు, కర్కోటకుడు, శంఖుడు, వాలిశిఖుడు, నిష్టానకుడు, హేమగుహుడు, నహుషుడు, పింగళుడు, బాహ్యకర్ణుడు, హత్తిపదుడు, ముధిరపిండకుడు, కంబలుడు, అశ్వతరుడు, కాళీయుడు, వృత్తుడు, సంవర్తకుడు, పెద్ద పద్మడు, చిన్నపద్మడు, శంఖముఖుడు, కూష్మాండకుడు, క్షేమకుడు, పిండారకుడు, కరవీరుడు, పుష్పదంష్ట్రుడు, బిల్వకుడు, బిల్వపాండురుడు, మూషకాదుడు, శంఖశిరుడు, పూర్ణభద్రుడు, హరిద్రకుడు, అపరాజితుడు, జ్యోతికుడు, శ్రీవహుడు, కౌరవ్యుడు, ధృతరాష్ట్రుడు, శంఖపిండుడు, విరజుడు, సుభాహుడు, శాలిపిండుడు, హస్తిపిండుడు, పిఠరకుడు, సుముఖుడు, కౌణపాశనుడు, కుఠరుడు, కుంజరుడు, ప్రభాకరుడు, కుముదుడు, కుముదాక్షుడు, తిత్తిరి, హలికుడు, కర్దముడు, బహుమూలకుడు, కర్కరుడు, అకర్కరుడు, మండోదరుడు, మహోదరుడు వీరందరూ పుట్టుకువచ్చారు. తరవాత.

## 31. శమీకుని మెడలో పాము

**సూ**తనందనా, ఆమహర్షి పేరు జరత్కారుడని చెప్పావే నువ్వు, అతని కాపేరు రావడాని కేమి కారణమో, దాని నిర్వచనం యేమిటో – ఇది వినాలని వుందయ్యా అనడిగాడు శౌనకుడు. చెబుతా విను అంటూ ప్రారంభించాడు సూతుడు.

జరత్ అంటే క్షమ అని అర్థం. కారు అంటే, దారుణమైనది అని. తీవ్రమైన తపస్సు చేశాడతను. అంచేత, అతని శరీరం దారుణంగా కృశించిపోయింది. అంచేత కలిగింది జరత్కారుడనే ప్రఖ్యాతి అతనికి. వాసుకిచెల్లెలు కూడా అంత తీవ్రంగానే తపస్సు చేసింది. అంచేత, ఆమెకున్నూ ఆపేరే వాడుక అయింది – సూతుడిలా చెప్పాటప్పటికి చాలా బాగుంది అంటూ నవ్వాడు శౌనకుడు. అంతగా కృశించి పోయినవారు – మరే కారణం వల్లా కాక, నియమనిష్ఠలతో తీవ్రతపస్సు చేసి అంత చిక్కిపోయి ఉన్నవారు బ్రహ్మచర్యవ్రతం నాశనం చేసుకుని వివాహం చేసుకోడానికి సిద్ధపడ్డారని వినేటప్పటికి వచ్చిందా నవ్వు శౌనకునకు.

ఒక్కమాటే నవ్వాడతను, అంతే. నవ్వి, ఇదివరలో ఇదంతా నువ్వొకమాటు చెప్పావు. నాకిప్పుడు కావలసింది ఆస్తీకుని పుట్టుక సంగతి. అది బాగా వివరించి చెప్పు అనడిగాడతను. సూతు డందుకున్నాడు మళ్ళీ.

ఆవేళ, వాసుకి, నాగుల నలా నియమించి తనచెల్లెలు జరత్కారువును వెంటబెట్టుకుని బయలుదేరాడు, ఇది విన్నావు నువ్వు. తరవాత, చాలాకాలానికి – ఆ జరత్కారుమహర్షి తపస్సు చేసుకుంటూ సంసార దృష్టి విడిచి భూమండలం అంతా తిరగసాగాడు. నిజంగా ఊర్ధ్వరేతస్కు డతను. స్వాధ్యాయపరుడు. భయరహితుడు. ఆత్మజ్ఞాని, భార్య కావాలన్న చూపే పెట్టుకోలే దత నెప్పుడూ.

తరవాత, కొంతకాలానికి, పరీక్షిత్తు అనే రాజొకనాడు వేటకి బయలుదేరా డడవికి. కురువంశవర్ధను డతను. తరవాత్తరవాత, మహా ధనుష్కుడైన పాండురాజు వేటకి వెళ్ళాడు చూడండీ, అలాగే పరీక్షిత్తున్నూ వేటకి వెళ్ళా డప్పుడు. అడవిపందులను కూల్చాడతను. అడవి

## 34. తక్షకుడు కాటు వేశాడు

**అ**య్యా, బ్రాహ్మణోత్తమా, చికిత్స చేసి నేను కరిచినవాళ్ళని బతికించగలవా నువ్వు? అయితే, యీమర్రిచెట్టు కరుస్తాన్నేను. దీన్ని బతికించునువ్వు. నీమంత్రబలం యేపాటిదో అదిన్నీ చూపించునాకు. అందుకోసం నీకు చేతనయినంతా చేసుకో. మాటలు చెప్పడం కాదు, మరి అన్నాడు తక్షకుడు సదర్పంగా. నిజమే, మాటలెందుకూ? కరవ్వయ్యా, నేనది మళ్ళీ బతికించి చూపిస్తా నన్నాడు కశ్యపుడు, నిశ్చలంగా. వెంటనే వెళ్ళి తక్షకుడా చెట్టుకరిచేశాడు. కరచీకరవగానే భగభగమండి బుగ్గిఅయిపోయిందా చెట్టు. మరి, కానియ్యి, చూస్తావేం? అనిన్నీ అడిగాడు.

చాలా దారుణ మయిందే నీవిషం, సందేహం లేదు. అయితేం, నువ్వు చూస్తూ వుండగానే నేనిది బతికించేస్తా నన్నాడు కశ్యపుడు. అని, బూడిద అంతా పోగుచేశాడు, ముందు, స్వయంగా. తరవాత మంత్రం వేశాడు, నిశ్చలంగా, కళ్ళు విప్పి చూడగా, ఆ బూడిదగుట్టలో ఒక  మొలక కనపడింది ముందు. ఉత్తర క్షణంలో రెండాకులు వేసిందది. మరోక్షణంలో చిన్న మొక్క అయింది. చివరికి, మొదట యెంతవుందో అంత పెద్ద చెట్టయింది, చివరి మరోక్షణంలో.

తెల్లపోయాడు తక్షకుడు. చాలా గొప్పవిద్య నీది అని మెచ్చుకున్నాడు కశ్యపుణ్ణి మొదట. నా విషమేకాదు, మరెంత గొప్ప నాగేంద్రుని విషమయినా విరిచేస్తావు నువ్వు, సందేహం లేదని పొగిడాడు తరవాత. అయితే బ్రాహ్మణోత్తమా, ఈవిద్య చూపించి రాజువల్ల యేంత డబ్బు సంపాదించుకోవాలని నీ ప్రయత్నం? ఎంత కష్టమయినా అంతడబ్బూ నేనిచ్చేస్తాను పట్టుకుపోవయ్యా. ఒక్క సంగతి మాత్రం ఆలోచించుకో బాగా, ఏమిటంటావా? ఈ రాజుకి బ్రాహ్మణ శాపం తగిలింది. ఆయువున్నూ తరిగిపోయివుంది. నీవిద్య ప్రయోగిస్తావు, నువ్వు, సందేహం లేదు; కాని అంత దృఢమైన మరణయోగం వుండగా, అతను బతకడం సాధ్యమా? సందేహం కలగడంలేదూ నీకూ? కనక, ఇటు డబ్బేకాదు, అటు

## 38. వంశోద్ధారకుడు

**సూ**తుడు ప్రారంభించాడు. మహాత్మా, నీపేరింటిదే నాచెల్లెలు కూడా నీలాగే తపస్సున్నూ చేసుకుంటోం దీమె. నేనే పోషిస్తా నీమెని. నీకాబాధ్యత యేమీ అక్కర్లేదు. కనక ఈమెని,నిస్సందేహంగా స్వీకరించి పెళ్ళిచేసుకో. నాసర్వశక్తులూ వినియోగించి ఈమెని పోషించడం విషయం నేనే చూసుకుంటాను, పూర్తిగా. ఇంతకీ, – నీ కోసమే నేనీమెను పెంచుతున్నా నయ్యా అనిచెప్పాడు వాసుకి స్పష్టంగా.

సరే అన్నాడు జరత్కారుడు. కానీ మళ్ళీ చెబుతున్నా నన్నాడు అతను. ముమ్మాటికీ నే నీమెను పోషించను. కాక, – నా కనిష్టంగా మసులుకుందా, వెంటనే విడిచిపెట్టేస్తా నీమెని. ఇది నావ్రతం సుమా అని ఖండితంగా కూడా చెప్పాడతను మళ్ళీ.

నువ్వు చెప్పినదాని కల్లానేనంగీకరించా నన్నాడు వాసుకి. అయితే నేను సిద్ధం అన్నాడు జరత్కారుడు. అంటూనే వాసుకి ఇంటికి బయలుదేరాడతను. వాసుకి సర్వమూ సిద్ధంచేశాడు. మంత్రవేత్తల్లో బహూ ఉత్తముడూ, తపోవృద్ధుడూ, నియమనిష్ఠలున్నూ కలవాడూ కనక, జరత్కారుడు శాస్త్రోక్తవిధానంగా పెళ్ళిచేసుకున్నాడు వాసుకి చెల్లెలు జరత్కారువును. చాలామంది మహర్షులు వచ్చి దీవించా రాదంపతులను.

వాసుకి అతని కొక వాసగృహం ప్రత్యేకంగా ఏర్పాటుచేశాడు. చాలా రమ్యంగా ఉందది. వేలలేని మంచమూ, దానిమీద అపూర్వమైన హంసతూలికా తల్పమూ, మంచిమంచి ఆసనాలూ – ఈ మొదలైన రమ్యవస్తువులు సమృద్ధిగా ఉన్నా యందులో. భార్యను వెంటబెట్టుకు వెళ్ళి జరత్కారు డందులో ప్రవేశించాడు, శుభముహూర్తాన.

మళ్ళీ చెప్పాడు జరత్కారుడు ఆయింటో ప్రవేశించాక గూడా భార్యతో. ఇదిగో నేనొక సమయం చేస్తున్నాను. ఇది ప్రతిజ్ఞ బాగా విను. నా కనిష్ట మైన పనేమీ చెయ్యగూడదు నువ్వెప్పుడూ. అనిష్టమైన మాట కూడా చెప్పగూడదు. అలా చేశావా, లేక, చెప్పావా, వెంటనే నిన్ను విడిచిపెట్టేస్తా న్నేను. ఈభవనం కూడా విడిచిపెట్టి వెళ్ళిపోతాను. నేను చెప్పిందంతా బాగా జ్ఞాపకం పెట్టుకో

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Mahabharat+Adi+Parvam](http://kinige.com/book/Mahabharat+Adi+Parvam)

* * *